క్లుప్తంగా

సైదాబాద్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న అనిత



అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

సైదాబాద్: సైదాబాద్ మండల తహసీల్దార్‌గా అనిత శుక్రవారం చంపాపేటలోని మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ చేసిన బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ రాజేంద్రనగర్‌కు బదిలీ కాగా, మంచాల మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనిత సైదాబాద్‌కు వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనితకు డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ రాజు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఆకట్టుకున్న 'హరిత భారత్'



సాక్షి, సిటీబ్యూరో: గడ్డిఅన్నారంలోని శ్రీ చైతన్య పాఠశాల వేదికగా చిన్నారులు నిర్వహించిన హరిత భారత్ కార్యక్రమం ఆకట్టుకుంది. స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల మొక్కలు నాటి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. నాటిన మొక్కల ప్రయోజనాలు, ప్రత్యేకతలు, వాటి ఔషధ విలువల గురించి ప్రిన్సిపాల్ సాయి గీత తెలియజేశారు. కార్యక్రమంలో దిల్‌షుక్‌నగర్ ఏజీఎం సతీష్, జోన్ ఆర్ఐ రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ జోనల్ కోఆర్డినేటర్ వంశీ, జితేందర్ పాల్గొన్నారు.

రేపు మోహన్‌నగర్‌లో ఘటం ఊరేగింపు

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో బోనాల సందర్భంగా అమ్మవారి ఘటం ఊరేగింపు ఈ నెల 6న నిర్వహిస్తామని ఊరేగింపు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యశ్పాల్ గౌడ్ తెలిపారు. శనివారం మోహన్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో అమ్మవారి ఘటం ఊరేగింపు పోస్టర్‌ను విడుదల చేశారు. రాజేందర్, కిరణ్, వినోద్, తరుణ్ సింగ్ ఠాగూర్, సంప్రీతి, అవినాష్ పాల్గొన్నారు.

ఏసీపీకి సత్కారం



ఏసీపీని సత్కరిస్తున్న భుజంగరెడ్డి

ఎల్‌బీనగర్: వనస్థలిపురం నూతన ఏసీపీ భీంరెడ్డిని శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందించారు.

రుణ మాఫీతో రైతుల్లో ఆనందం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అన్మగల్ హయత్‌నగర్‌లో ఎడ్లతో దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: రాష్ట్రంలోని రైతులకు రుణ మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తున్నదని, ఈ ప్రకటనతో కేసీఆర్ మరోసారి రైతు బాంధవుడిగా నిరూపించుకున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ ప్రకటించడంతో శుక్రవారం హయత్‌నగర్‌లో రైతులు కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల కోట్ల రూపాయల రుణాలను రాష్ట్ర ప్రభుత్వం చేయనుందని తెలిపారు. అన్మగల్ హయత్‌నగర్‌లోని రైతులు తమ భూముల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకోవచ్చని, దీనిపై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి దుక్కి దున్ని, ట్రాక్టర్‌ను నడిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతు రుణ మాఫీ హర్షణీయం



వనస్థలిపురంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రాంమోహన్‌గౌడ్, లక్ష్మీప్రసన్న

వనస్థలిపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ. ఒక లక్ష పంట రుణాలను మాఫీ చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బీఆర్ఎస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగోని రాంమోహన్ గౌడ్ అన్నారు. రైతుల రుణాలను మాఫీ చేస్తూ సీఎం ప్రకటన చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతుబజారు వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి రాంమోహన్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ కార్పొరేటర్లు వజీర్ ప్రకాష్‌గౌడ్, సామ రమణారెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తుల రాంబాబు పలువురు రైతులు పాల్గొన్నారు.

ముగిసిన జీఎస్ రిక్రియేషన్ క్లబ్ స్పోర్ట్స్ మీట్

మన్సూరాబాద్: జీఎస్ఐలోని జీఎస్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న లోకల్, ఇన్‌ట్రా స్పోర్ట్‌మీట్ శుక్రవారం ఘనంగా ముగిసింది. జీఎస్ఐ ఏడీజీ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. టేబుల్ టెన్నిస్ సింగిల్‌లో ఉమాశంకర్, డబుల్స్‌లో పీసీ మాథ్యూస్, ఉమాశంకర్ విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ సింగల్స్ విభాగంలో అజిత్‌కుమార్, డబుల్స్‌లో వీకేవీ సత్యనారాయణ, ప్రశాష్‌రావు గెలుపొందారు. బ్యాలెన్స్ రేస్‌లో పూజా యాదవ్, షార్ట్‌పుట్ పురుషుల విభాగంలో స్మృతి రంజన్ పాండ, మహిళల విభాగంలో పూజారాణి, జావెలిన్ త్రో పోటీలో సమీర్‌కుమార్, బోనిక్‌లు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జీఎస్ఐ డీడీజీలు అంజుమన్ ఆచార్య, ఎస్ఎన్ మహాపాత్ర, ఎల్‌పీ సింగ్, డైరెక్టర్ ఎంఎల్ దోర, ఎం మిశ్రా, క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్, నరేందర్, ప్రధాన కార్యదర్శి పీసీ మాథ్యూస్, జాయింట్ సెక్రటరీ ఏఎస్ రసూల్‌ఖాన్, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాసరావు, కల్చరల్ సెక్రటరీలు మూర్తి మోహన్, సూర్యనారాయణ, అనురాధ, శేఖర్, ఝాన్సీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలి: కొప్పుల

మన్సూరాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. డివిజన్‌లోని హయత్‌నగర్ పరిధి నాయక్‌నగర్ కాలనీలో రూ.34 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. పనులకు అడ్డంకులు సృష్టిస్తున్న వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఇంటి ర్యాంపులు, మెట్లను రోడ్లపైకి వచ్చేలా నిర్మించవద్దని కాలనీలవాసులను కోరారు. కాలనీలోని మిగిలిన రోడ్లను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు విష్ణుమూర్తి, రవీందర్‌రెడ్డి, సీతారామశర్మ, లక్ష్మణ్, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, పారంద సాయి, కడారి యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న పవన్‌కుమార్

నాగోలు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువులో రాణించి ఉన్నంత శిఖరాలు చేరుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. డివిజన్‌లో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ తెలంగాణ ఓపెన్ స్కూల్ కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుకోక ఇబ్బందులు పడుతున్న వారు ఓపెన్ స్కూల్‌లో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వసతుల కోసం కార్పొరేటర్ రూ.20 వేలు విరాళం ప్రకటించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్, బీజేపీ నాయకులు నిరంకి రవి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నులి పురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రల పంపిణీని కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మీమధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను తప్పక వేయించాలన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్, సిబ్బంది మమత, అపర్ణ సుజాత, మధు పాల్గొన్నారు.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం

నాగోలు: బీజేపీ చేనేత సెల్ రంగారెడ్డి జిల్లా అర్బన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్స్‌లో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తామని చేనేత సెల్ కన్వీనర్ బొమ్మ రఘురామ్ నేత తెలిపారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, సామ రంగారెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని గాయత్రినగర్, బ్యాంక్ కాలనీల్లో శుక్రవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రైనేజీ, తాగు నీరు, విద్యుత్ వంటి ప్రధాన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఈ రాకేష్, కాలనీవాసులు సరస్వతి, ఉపేందర్, రమేష్, మనోహర్, హేమలత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అకుంఠిత దీక్షతో లక్ష్యాలను సాధించాలి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

మలక్‌పేట: విద్యార్థులు అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఉస్మానియా యూనివర్సిటీ అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో 'ఆరంభ్–2కె23' పేరుతో బీకామ్, బీబీఏ ఫ్రెషర్స్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎం.శ్రీనాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో విద్యార్థులు మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్య ఎంతో శక్తివంతమైనదని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ వీసీ, తెలంగాణ టీఎస్‌సెట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం నరేష్‌రెడ్డి, రామకృష్ణ మఠం బ్రహ్మచారి సత్యచైతన్య స్వామీజీ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, కాలేజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ టి. వెంకటేశ్వర్ రావు, డాక్టర్ ఎస్. అప్పారావు, ఇన్‌చార్జి మోహన్ పాల్గొన్నారు.

పేదలకు అందని సంక్షేమ పథకాలు



కాలనీలలో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రేషన్ కార్డులు తప్ప 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని, దీంతో అర్హులైన పేదవారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన లింగోజిగూడ డివిజన్‌లోని లింగోజిగూడ ఓల్డ్ విలేజ్, త్రిమూర్తి కాలనీ, కుమ్మరి బస్తీ, కామేశ్వర కాలనీ, తపోవన్ కాలనీల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను మోసం అజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుకుందని, మరోసారి ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కింద ఇళ్లు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేయగా, ఆ ఇళ్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. ఎల్‌బీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే తన అనుచరులకు తప్ప అర్హులకు అందజేయలేదని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ సుపరిపాలన అందిస్తోందని, రాష్ట్రంలో కూడా సుపరిపాలన కోసం బీజేపీకి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, నాగరాజు, కుమర్, రవి, గంగాధర్‌గౌడ్, కృష్ణంరాజు, రాకేష్, కిరణ్, ప్రవీణ్‌గౌడ్, హరిప్రసాద్, జగదీష్, కృష్ణగౌడ్, సాయియాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ నేత రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి



వివేకానందనగర్‌లోని వృద్ధాశ్రమంలో..

మన్సూరాబాద్: బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మన్సూరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆశీర్వాదం తీసుకున్న రఘువీర్‌రెడ్డి అనంతరం వీరన్నగుట్టలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి నివాసంలో కేక్ కటింగ్ చేసి ఆశ వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. వివేకానందనగర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. మన్సూరాబాద్ చౌరస్తాలో అభిమానులు భారీ గజమాలతో రఘువీర్‌రెడ్డిని సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

మలక్‌పేట: చదువుతో పాటు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని విద్యాసంస్థల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని నవ్య జూనియర్ కాలేజీలో చదువుతున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి ఆర్. రాహుల్ జావెలిన్‌త్రో క్రీడలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రిన్సిపాల్ రేవతి విఠల్‌తో కలిసి రాహుల్‌కు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. కొప్పుల చందుగౌడ్, రాకేష్, రమేష్, వరలక్ష్మి, మదర్ వల్లి, ప్రశాంతి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 75, వంకాయ 45, బెండ 45, పచ్చిమిర్చి 55, కాకర 45, బీర 23, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 45, క్యారెట్ 28. దొండ 21, ఆలు 21, ఉల్లి 22, గోకర 35, దోస 30, సొర 15, పొట్ల 23, అరటి 13, చిక్కుడు 65, అర్వి 41.

బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై పోక్సో కేసు

మలక్‌పేట: బాలికకు మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకున్న వ్యక్తిపై మలక్‌పేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ గుంజె శ్రీనివాస్ కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రాధేశ్యామ్(45), మలక్‌పేటకు చెందిన ఓ బాలిక దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ దుకాణంలో పని చేస్తున్నారు. బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడటంతో పాటు ఆమెను బయటకు తీసుకెళ్లి పెళ్లి కూడా చేసుకున్నాడు. బాలిక అదృశ్యం కావడంతో ఈనెల 2 న ఆమె తల్లిదండ్రులు మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు రాధేశ్యామ్‌ను శుక్రవారం అరెస్టు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్య, కొడుకును హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: కట్టుకున్న భార్యను, కన్నకొడుకును హత్య చేసి, నిప్పటించిన కేసులో భర్తకి జీవిత ఖైదు, రూ. 6వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎల్బీనగర్‌లోని 7వ అదనపు సెషన్స్ జడ్జి కమ్ ఎస్సీ/ఎస్టీ కోర్టు న్యాయమూర్తి మహమద్ అఫ్రోజ్ అఖ్తర్ తీర్పు వెలువరించారు. ఏపీపీ చంద్రశేఖర్ కథనం ప్రకారం... సుశ్రుత అనే యువతిని, ఘన్‌పూర్‌కు చెందిన రమేశ్ 2015లో పెద్దలకు తెలియకుండా ప్రేమవివాహం చేసుకొని ఎర్రగడ్డలో కాపురం పెట్టాడు. వారికి ఒక బాబు పుట్టాడు. కాగా, కులాలు వేరు కావడంతో సుశ్రుతను ఇంట్లోకి రానివ్వమని రమేశ్ తల్లిదండ్రులు చెప్పారు. సుశ్రుత తనను, కుమారుడిని మీ ఇంటికి తీసుకెళ్లాలని భర్తపై ఒత్తిడి తెచ్చింది. తల్లిదండ్రులు, భార్య మధ్య సఖ్యత కుదుర్చలేని స్థితిలో భార్య,కుమారుడిని హత్య చేయాలని రమేశ్ నిర్ణయించుకున్నాడు. భార్య,కుమారుడిని బైక్‌పై ఎక్కించుకొని ఘనాపూర్ బయలుదేరాడు. ఈ సమయంలో తనతోపాటు ఉండాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని సుశ్రుత నిద్ర మాత్రలు మింగి స్పృహ కోల్పోయింది. ఇదే అదునుగా భావించిన భర్త దగ్గరలోని పొలాల్లోకి తీసుకెళ్లి భార్య, కొడుకుని గొంతు నలిమి చంపేసి, పెట్రోలు పోసి మృతదేహాలను కాల్చేసి పరారయ్యాడు. తర్వాత నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ కేసును విచారించిన కోర్టు నిందితుడికి జీవిత ఖైదు శిక్ష, జరిమానా విధించింది.

ఎరుకల గర్జనను విజయవంతం చేయండి



మన్సూరాబాద్: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6న ఎల్‌బీనగర్‌లోని ఎస్‌కే గార్డెన్స్‌లో నిర్వహించే ఎరుకల గర్జనను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివాసీ ఎరుకల గిరిజన సమస్యల సాధనకు నిర్వహిస్తున్న ఎరుకల గర్జన కరపత్రాన్ని మన్సూరాబాద్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. పెద్ద సంఖ్యలో ఎరుకల కులస్తులు హాజరై ఎరుకల గర్జనను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు చిరుమర్తి శేఖర్, నల్గొండ శ్రీనివాస్, చర్ల రమేష్, కందెల వెంకటేశ్వర్లు, నాగార్జున, రఘు, సుబ్బారావు, గంగయ్య, వెంకటేష్, రవి, స్వామి పాల్గొన్నారు.

సికింద్రాబాద్ నుంచి అరుణాచలం వరకు గో మహాపాదయాత్ర

సైదాబాద్: గోవులను రక్షించడం ద్వారా సకల మానవాళికి సాయం చేసినట్లు అవుతుందని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి అన్నారు. గోవులను రక్షించాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని, ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరుతూ గో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఫౌండేషన్ కార్యాలయంలో యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ నెల 6న ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి బయలుదేరే పాదయాత్ర మొదట తిరుపతి, అరుణాచలం వరకు సాగుతుందని తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి, శివ మాలలు ధరించిన 100 మంది స్వాములతో 25 రోజుల పాటు 789 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు కిరణ్ గుత్తికొండ, సాంభవి, అవంతిక, శివకృష్ణ పాల్గొన్నారు.

18లోపు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

నాగోలు: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 2023– 2025 సంవత్సరాలకు నూతన మద్యం పాలసీ ప్రక్రియ వివరాలను మేడ్చల్–మల్కాజిగిరి ఎక్సైజ్ యూనిట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కె.విజయ్‌కుమార్ డి.అరుణ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం నాగోలు అనంతుల రాంరెడ్డి గార్డెన్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, మేడ్చల్ యూనిట్ 114 దుకాణాలకు, మల్కాజిగిరి యూనిట్ 88 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి యూనిట్‌లో ఉప్పల్, మల్కాజిగిరి, ఘట్‌కేసర్ ఎక్సైజ్ సర్కిల్ ఉన్నాయని, ఉప్పల్ సర్కిల్లో 28 దుకాణాలకు గాను ఒకటి ఎస్సీకి, 3 దుకాణాలు గౌడ్‌లకు, మల్కాజిగిరి సర్కిల్లో 19 షాపుల్లో ఒకటి ఎస్టీకి, 2 ఎస్సీలకు, 4 గౌడ్‌లకు కేటాయించామన్నారు. నూతన మద్యం పాలసీ దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం నాగోలులోని అనంతుల రామ్‌రెడ్డి గార్డెన్స్‌లో ప్రారంభమైందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 18 తేదీ వరకు అన్ని పని దినాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా శనివారం అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉ 8 నుంచి 11 గంటల వరకు...
  ఎంఆర్ఓ ఆఫీస్, వీఎన్‌రెడ్డి నగర్, గ్యాస్ కంపెనీ, హెగ్డే నర్సింగ్‌హోం, ఆర్‌టీఏ ఆఫీస్, మూసారాంబాగ్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్, వివేకానంద స్కూల్, మోర్ మార్కెట్ పరిసరాలు.
- ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు..
  ఆర్‌టీఏ ఆఫీస్, ఈస్ట్ అండ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్, శ్రీపురం కమ్యూనిటీహాల్, నాగ దేవాలయం, నూర్‌ఖాన్ బజార్, యునైటెడ్ బేకరీ, నూర్ కేఫ్, కోమటివాడి, సెంట్రల్ బ్యాంక్, గర్ల్స్ స్కూల్, దారుషఫా చమన్, హుస్సేనీ మొహల్లా, ఇండియన్ బ్యాంక్, మదీనా కాంప్లెక్స్, గోల్‌కబర్, లాల్ మిట్టీ దర్గా, ఎంసీహెచ్ ఆఫీస్ పరిసరాలు.
- మ. 3 నుంచి సా.5 గంటల వరకు..
  గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరో హోండా షోరూం వెనుక ప్రాంతం, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రాసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ ప్రాంతాలు.